దేశద్రోహులే ఆయనకు మిత్రులు



● రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లేది..వారికి షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకే
● ఎంపీ తేజస్వీ సూర్య ధ్వజం

7





కేబినెట్ భేటీపైనే.. ఆశలు

● పదేళ్ల తర్వాత 17న కలబురగిలో మంత్రివర్గ సమావేశం
● కల్యాణ కర్ణాటక అభివృద్ధికి అడుగులు పడేనా..?

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంగా ముద్రపడి రాజ్యాంగబద్ధంగా ఆర్టికల్ 371జే అమలులోకి వచ్చి పదేళ్లు అవుతున్నా సాధారణ మార్పులు రాలేదనే నిరుత్సాహంలో ఉన్న కల్యాణ కర్ణాటక ప్రజలు త్వరలో జరిగే కేబినెట్ సమావేశంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వస్థలం కలబురగిలో పదేళ్ల తర్వాత కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన ఈనెల 17న కేబినెట్ సమావేశం కలబురగిలో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కల్యాణ కర్ణాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి పతాకావిష్కరణ చేయనున్నారు. సాయంత్రం కేబినెట్ జరగనుంది. హైదరాబాద్-కర్ణాటక ప్రాంతంగా ఉండే కలబురగి, బీదర్, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాలను ప్రస్తుతం కల్యాణ కర్ణాటకగా పిలుస్తున్నారు. హైదరాబాద్ - కర్ణాటక విమోచన జరిగి 75ఏళ్లు కావస్తున్న తరుణంలో అమృత కాలఘట్టానికి చేరింది. వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేసేందుకు ఆర్టికల్ 371జేను తీసుకొచ్చి దశాబ్దకాలం అవుతోంది. ఇలా రెండు కీలకమైన అంశాలకు సుదీర్ఘ చరిత్ర ఉన్న తరుణంలో రాష్ట్ర కేబినెట్ సభ్యులంతా కలబురగికి చేరుకుని ఒక రోజంతా గడుపుతుండడంతో ఈ ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి ఉంటుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంతజిల్లా కలబురగితోపాటు కల్యాణ - కర్ణాటక పరిధిలో 41 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో 26 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఐదు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికైన విషయం తెలిసిందే. ఇలా కాంగ్రెస్ పార్టీపట్ల విశ్వాసం చూపిన ప్రజలకు రుణం తీర్చుకునేలాంటి నిర్ణయాలు కేబినెట్‌లో ఉంటాయని స్థానిక కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

సిద్దరామయ్య నేతృత్వంలో రెండో కేబినెట్

సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే 2014లో తొలిసారి కలబురగిలో ప్రత్యేక మంత్రివర్గ సమావేశం జరిపారు. ప్రస్తుతం పదేళ్ల తర్వాత రెండోసారి కేబినెట్ భేటీకి ఆహ్వానించారు. 1982 అక్టోబరులో ఆర్ గుండూరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కలబురగిలో కేబినెట్ భేటీ జరిగింది. యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు 2008 సెప్టెంబరు 26న మంత్రివర్గ భేటీ జరిగింది.

అభివృద్ధిపై ఎన్నో ఆశలు

హైదరాబాద్ నిజాం పాలన సాగిన ప్రాంతం కావడంతో హైదరాబాద్- కర్ణాటకగా సుదీర్ఘకాలంగా పిలుస్తున్నారు. ఇటీవలే ఆ పేరును కల్యాణ కర్ణాటకగా మార్పు చేశారు. కలబురగి, బీదర్, యాదగిరి, రాయచూరు, బళ్ళారి, కొప్పళ, విజయనగర జిల్లాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. నిజాం పాలనలో ప్రజాసంక్షేమం జరగలేదు. వారికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడ్డారు. నిజాం నుంచి 1948 సెప్టెంబరు 17న విముక్తి పొందారు. ఈ ప్రాంతంలో వెనుకబడినవర్గాలు అధికం, భాషా సంయుక్త రాష్ట్రంగా విభజన జరిగిన తర్వాత కూడా వెనుకబాటు మచ్చలో మార్పు రాలేదు. ఆ తర్వాత అన్ని పార్టీల ప్రభుత్వాలు వచ్చినా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో సమానం అనిపించేలా ప్రగతికి నోచుకోలేదు. రాష్ట్ర మానవ అభివృద్ధి సూచిక, తలసరి ఆదాయంలో కల్యాణ - కర్ణాటక ప్రాంతం చివరిస్థానంలో ఉంది. నిరుద్యోగం, నిరక్షరాస్యత, పౌష్టికాహార లోపం, బడి మానేసిన పిల్లలు, పేదరికం వంటివి ఈ జిల్లాల్లో పెను సవాళ్లుగా ఉన్నాయి.

డిమాండ్‌లు ఇవే...

కల్యాణ కర్ణాటకలో ఖాళీగా ఉండే 20వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఆర్టికల్ 371జె ద్వారా సంక్షేమానికి అవసరమైన గ్రాంట్లు, సౌలభ్యాలు రావాలి. కల్యాణ కర్ణాటకకు పరిశ్రమలు కేటాయించాలి. విజయనగరకు మెడికల్ కాలేజ్, ఎయిర్‌పోర్ట్, కన్నడ విశ్వవిద్యాలయానికి గ్రాంట్లు అవసరం. రాయచూరు విశ్వవిద్యాలయానికి గ్రాంట్లు, ఎయిర్‌పోర్ట్ పనులు ముగించడం, జిల్లా పాలనా భవనం ఏర్పాటు, ఓపెక్ ఆసుపత్రి ఆధునీకరణ, తుంగభద్ర లెఫ్ట్‌బ్యాంక్ కెనాల్ (టిఎల్‌బిసి) సమాంతర జలాశయం నిర్మించాలి. కొప్పళలో నీటి ప్రాజెక్టులకు గ్రాంట్లు, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, కొప్పళ యూనివర్సిటీకి గ్రాంట్లతోపాటు తుంగభద్ర జలాశయానికి ప్రత్యామ్నాయంగా నవళి సమాంతర జలాశయ నిర్మాణం, బళ్ళారిలో జీన్స్ అపెరల్‌పార్క్, ఎయిర్‌పోర్ట్, స్టీల్‌హబ్ చేయడం, యాదగిరిలో పారిశ్రామికవాడ అభివృద్ధి వంటివి జరగాల్సి ఉంది.

అభివృద్ధికి కట్టుబడ్డాం : ప్రియాంక ఖర్గే



కల్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేబినెట్ భేటీ జరగనుండడం సంతోషంగా ఉందని మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు. ఈప్రాంత సమస్యలపై చర్చలు జరిగే అవకాశం గురించి స్థానికులలో ఆసక్తి ఉందన్నారు.

సీఎంను తప్పించేందుకే
కుట్ర



నాగమంగల బాధితులను పరామర్శిస్తున్న కేంద్రమంత్రి కుమారస్వామి

● కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలోనే నాగమంగల గొడవలు ● కేంద్రమంత్రి కుమారస్వామి ఆరోపణలు
● వినాయక విగ్రహాలతో బీజేపీ నిరసన.. అడ్డుకున్న పోలీసులు ● బాధ్యులపై సస్పెన్షన్ వేటు

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగమంగలలో గొడవలు కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే జరిగాయని, కేంద్రమంత్రి కుమారస్వామి సంచలన ఆరోపణ చేశారు. విధ్వంసం జరిగిన నాగమంగల పట్టణంలోని వీధులను శుక్రవారం కుమారస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సిద్దరామయ్యను ముఖ్యమంత్రి పదవినుంచి తప్పించేందుకు సాగిన కుట్ర అన్నారు. 1990లో వీరేంద్ర పాటిల్‌ను ఇదే తరహాలో గొడవలు రేకెత్తించారన్నారు. కాంగ్రెస్‌లోని గ్రూపు విబేధాలే గొడవలకు కారణమన్నారు. వినాయక నిమజ్జనం వేళ సాగిన ఇరువర్గాల గొడవ రెండు మతాల మధ్య విబేధాలకు కారణం కాగా కుమారస్వామి వ్యాఖ్యలతో రాజకీయ రంగుపడింది. గురువారం బీజేపీ బృందం పర్యటించి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించింది. కాలిపోయిన పలు దుకాణాలను కేంద్రమంత్రి కుమార పరిశీలించారు. ఎఫ్ఐఆర్ నమోదుపైన కేంద్ర మంత్రి మండిపడ్డారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠ చేసినవారే తొలి నిందితుడిగా నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విగ్రహ ప్రతిష్ఠ, నిమజ్జనానికి పోలీసులు ముందుగానే అనుమతులు ఇస్తారన్నారు. నిమజ్జనం వేళ ఎందుకు ఎక్కువమంది పోలీసులను నియమించుకోలేదన్నారు. డీపీఆర్ పోలీసులను ఓ ప్రార్థనా మందిరం నుంచి మరో చోటుకు పంపినవారు ఎవరని, ఆ ఆదేశాలు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అకస్మిక సంఘటన అయితే వేటకొడవళ్లు, పెట్రో బాంబులు ఎలా సిద్ధమయ్యాయని ప్రశ్నించారు. ఇదంతా ముందస్తుగా నిర్ణయించుకున్న కుట్ర అన్నారు. ఇంతకూ పరమేశ్వర్‌కు హోం మంత్రి పదవి ఇచ్చినవారెవరని ప్రశ్నించారు. సర్వం కోల్పోయినవారికి కొంత సాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.




గణేశ్ విగ్రహాలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నిరసనకారులను అడ్డుకుంటూ..

టౌన్‌హాల్ వద్ద భారీ నిరసన

నాగమంగల గణేశ ఉత్సవం వేళ విధ్వంసంపై బెంగళూరులో హిందూ సంఘాలు, గణేశ ఉత్సవ కమిటీలు టౌన్‌హాల్ ముందు శుక్రవారం నిరసన తెలిపాయి. దారుణాలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వినాయక విగ్రహంతోనిరసనకు దిగగా పోలీసులు అడ్డుకున్నారు. విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

నాగమంగల సంఘటనకు బాధ్యుడిని చేస్తూ ఇంటలిజెన్స్ ఏడీజీపీ శరత్‌చంద్రను బదిలీ చేశారు. ఈ స్థానంలో హేమంత్ నింబాల్కర్‌ను నియమించారు. 2013-18 సిద్దరామయ్య పాలనలో హేమంత్ నింబాల్కర్ ఇంటలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించారు. హేమంత్ నింబాల్కర్ భార్య అంజలి నింబాల్కర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కాగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. హేమంత్ నింబాల్కర్ ప్రస్తుతం సమాచారశాఖ కమిషనర్‌గా వ్యవహరిస్తుండగా అదనంగా ఇంటెలిజెన్స్ విభాగానికి ఇన్‌చార్జ్‌గా నియమించారు. కాగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు.



నిరసన కారులను తరలిస్తూ..



టౌన్‌హాల్ వద్ద పోలీసుల బందోబస్తు

అనుమతివ్వండి ప్లీజ్..!

● ఆపరేషన్ కమల వివాదంపై లోకాయుక్త విచారణకై స్పీకర్‌కు పిటిషన్



బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కమల ద్వారా 17మంది కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన అంశమై లోకాయుక్త విచారణకు అనుమతులు కోరుతూ శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్‌కు వినతి పంపారు. జనాధికార సంఘర్ష పరిషత్ పదాధికారి ఆదర్శ్ ఆర్ అయ్యర్ బుధవారం వినతిని ఇచ్చారు. 17మంది ఎమ్మెల్యేలు విప్ ఉల్లంఘించడమే కాకుండా ఏకంగా రాజీనామాలు చేశారని, వారిపై ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపేలా విన్నవించారు. కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుతాన్ని కూల్చేందుకు సాగిన కుట్రపై సమగ్ర దర్యాప్తు సాగాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రత్యేక న్యాయస్థానం ముందు 2020 జనవరి ఆదేశాల అనంతరం రెండేళ్లపాటు కొవిడ్, ఆ తర్వాత రాష్ట్ర కేంద్రంలో ఎన్నికల కారణాలతో కేసును నిర్లక్ష్యం చేశారన్నారు. సమగ్ర దర్యాప్తు జరిగితే ఎంతమేర లావాదేవీలు సాగాయి, వారి ఆలోచనలు ఏమిటనేది బహిరంగం కానుందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

పేదల సొమ్మును కాజేశారు

● వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై... గవర్నర్‌కు బీజేపీ రెబల్స్ ఫిర్యాదు

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై పాదయాత్ర జరపదలచుకున్న బీజేపీలోని రెబెల్స్ వర్గం ఓ అడుగు ముందుకేసింది. శుక్రవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లోట్‌కు వినతిపత్రాన్ని బృందం అందజేసింది. వాల్మీకీ కార్పొరేషన్‌లో 189 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని గవర్నర్‌కు వివరించారు. ఈ వివాదాన్ని మూసివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. ఇదే కేసును సీఐడీ విచారణలో మాజీ మంత్రి నాగేంద్రకు క్లీన్‌చిట్ ఇవ్వగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కోర్టుకు సమర్పించిన చార్జ్‌షీట్‌లో నాగేంద్ర ప్రధానసూత్రధారిగా పేర్కొందన్నారు. ప్రభుత్వం అవినీతి వివాదాలను కప్పిపుచ్చేందుకు కుట్రలు పన్నుతోందని వివరించారు. గవర్నర్‌ను కలసిన బృందంలో రమేశ్ జార్కిహోళి, బసనగౌడపాటిల్ యత్నాళ్, అరవింద లింబావళి, బీపీ హరీశ్, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, కేంద్ర మాజీ మంత్రి జీఎం సిద్దేశ్వర్ తదితరులు ఉన్నారు. అనంతరం వారు రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు అన్ని విధాలా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో రూ.12వేల కోట్ల గ్యారెంటీ పథకాలకు వినియోగించారన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో సమాజానికి చెందిన వారికి ఆర్థికంగా వెసలుబాటు కల్పించాల్సి ఉండగా లోక్‌సభ ఎన్నికల కోసం లూటీ చేశారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బళ్ళారి నుంచి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి అరుణ్ హిరేహాళ్ కౌంటింగ్‌కు ముందే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కార్పొరేషన్ చైర్మన్ అశోక్ దద్దల్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే పాదయాత్ర చేస్తామన్నారు. బీజేపీ రెబెల్ బృందం బహిరంగంగానే సవాల్ విసిరినట్లయ్యింది.



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ బృందం

కన్నడ నేర్చుకోండి

● రైల్వే అధికారులకు మంత్రి సోమణ్ణ క్లాస్

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారులు కన్నడ భాషను నేర్చుకోవాలని మంత్రి సోమణ్ణ క్లాస్ పీకారు. రైల్వేసహాయ మంత్రి సోమణ్ణ మైసూరు జిల్లాలో శుక్రవారం పర్యటించారు. తొలుత నాడదేవత చాముండేశ్వరి దేవిని దర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ, మాజీ ఎమ్మెల్యే నాగేంద్రలు ఉన్నారు. అనంతరం మైసూరులోని రైల్వేస్టేషన్, అశోకపురం రైల్వే స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ యదువీర్, ఎమ్మెల్యే శ్రీవత్స రైల్వే అధికారులు ఉన్నారు. హిందీ మాట్లాడుతున్న రైల్వే అధికారులకు కన్నడ నేర్చుకోవాలని కేంద్రమంత్రి సోమణ్ణ క్లాస్ తీసుకున్నారు. స్థానికంగా ఉంటూ కన్నడ నేర్చుకోకుంటే ఎలాగన్నారు. కేవలం 3 రూపాయలకే కన్నడ నేర్చుకునే పుస్తకం లభిస్తుందన్నారు. మాతృభాషకు అభ్యంతరం లేదని అలాగే స్థానికంగా ఏ రాష్ట్రంలో ఉంటున్నారో ఆ భాష నేర్చుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులనుంచి స్థానిక అంశాలపై ఆరా తీశారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సోమణ్ణ



విరాళం చెక్కుతో తెలుగు విజ్ఞాన సమితి పదాధికారులు

ఆంధ్రులకు అండగా..!

● ఏపీ వరద బాధితులకు బాసటగా తెలుగు విజ్ఞాన సమితి
● ప్రత్యేక నిధి ఏర్పాటు
● ఏపీ సీఎం సహాయనిధికి రూ.5లక్షల విరాళం

వివరాలు 7లో


ఆకులతో నెమలి.. కాకరతో మొసలి..!

నోరూరించే ఫలాలతో ఆకట్టుకునే పక్షులు, పూలతో అందమైన నెమళ్లు..రకరకాల కూరగాయలతో జంతువుల చిత్రాలు.. ఇలా అందమైన రూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణగిరి జిల్లా హోసూరులో ఫల, పుష్ప ప్రదర్శన సందర్శకులను కట్టి పడేసింది.

వివరాలు..6లో



ఆకట్టుకుంటున్న ప్రదర్శన



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.88	1,622.46
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	24,776	2554
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	24,237	9,995
సామర్థ్యం (టీఎంసీలు)	101.30	68.50



బాధితులతో వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పిచ్చికుక్క దాడిలో పది మందికి గాయాలు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 13: వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులపై పిచ్చికుక్కదాడి చేయడంతో 10మందికి పైగా గాయపడిన ఘటన తెక్కలకోట ఫిర్కా పరిధిలోని కెంచనగుడ్డ గ్రామంలో చోటు చేసుకుంది. సిరుగుప్ప తాలూకా పరిధిలోని కెంచనగుడ్డ గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని బుధవారం గ్రామ ప్రజలు సమీపంలోని తుంగభద్ర నదిలో నిమజ్జనం చేయడానికి వాయిద్యాలతో తీసుకెళుతుండగా, పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. గాయపడిన వారిలో కెంచనగుడ్డ గ్రామానికి చెందిన లక్ష్మి, కుప్పయ్య, శివకుమార్, కె.తాండా గ్రామానికి చెందిన లక్ష్మి సేవియప్ప, గంగానాయక్, రవినాయక్, సరస్వతి, గణేష్, తిరుమలేష్ తదితరులున్నారు. గాయపడిన వారందని సిరుగుప్ప తాలూకా ఆసుపత్రికి తరలించి అవసరమైన చికిత్సను అందజేశారు.

శిథిలావస్థలో పాఠశాల



పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

సిరుగుప్ప, సెప్టెంబరు 13 : సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం పక్కన వున్న 7, 8వ వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. 50 యేళ్ల కిందట ప్రభుత్వం పాఠశాల భవనం పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పాఠశాల పైకప్పు లేచిపోయింది. గోడలు బీటలు వారాయి. ఈ పాఠశాలను తొలగించి నూతన తరగతి గదులను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి పశువులతో రవాణాకు అంతరాయం

కంప్లి, సెప్టెంబరు 13 : కుడితిని పట్టణంలోని బస్టాండు వద్ద ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద వీధి పశువులు రోడ్డుపై అడ్డంగా పడుకోవడం వల్ల ప్రయాణికులకు ఆటంకాలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నోసార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ఇలా వీధి పశువుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వెంటనే పట్టణ పంచాయతీ అధికారులు ప్రయాణానికి ఆటంకం కలిగించే పశువులను పట్టుకుని వెంటనే గోశాలకు తరలించాలని కోరారు.



రోడ్లపై నిలిచిన పశువులు

ఖంగుతిన్న కాంగ్రెస్..!

● విజయనగర నగరసభ ఎన్నికల్లో బీజేపీ విజయం



అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన రూపేష్ కుమార్, రాజేష్ గుప్తా

బళ్లారి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హొస్పేట్(విజయనగర) నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను పొందడంలో బీజేపీ విజయఢంకా మోగించింది. అత్యంత నాటకీయ పరిణామాల మధ్య జరిగిన ఈ ఎన్నికలు సర్వత్రా ఆసక్తిని పెంచాయి. హొస్పేట్ నగరసభ కు బీజేపీ నుంచి అధ్యక్షునిగా రూపేష్ కుమార్, ఉపాధ్యక్షునిగా రమేష్ గుప్తా ఎన్నికయ్యారు.

హొస్పేట్ నగరసభలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. కౌన్సెలర్లుగా కాంగ్రెస్ నుంచి 12మంది, బీజేపీ నుంచి 10 మంది, ఏఏపీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లుగా 12 మంది గెలుపొందారు. నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షలుగా గెలవడానికి 19 మంది కౌన్సిలర్లు ఓటు వేస్తే గెలుస్తారు. కానీ కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన కారంపొడి మహేష్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇక బీజేపీకి ఇండిపెండెంట్లు 12 మంది, మద్దతు ఇచ్చారు. దీంతో బీజేపీ నుండి నగరసభ అధ్యక్షుడుగా పోటీ చేసిన రూపేష్ కుమార్, ఉపాధ్యక్షుడుగా రమేష్ గుప్తా గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. హొస్పేట్ నగరసభను కాంగ్రెస్ కోల్పోవడం ఆ పార్టీకి ఎదురు దెబ్బేనని భావిస్తున్నారు.

నాయకుల మధ్య ఆధిపత్య పోరు

కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే గవియప్ప, ఎంపీ తుకారాం, ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ మధ్య సమన్వయం కొరవడిందని కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. వీరి కారణంగా పార్టీ చేతిలో ఉండే నగరసభ స్థానం కోల్పోయామని కొందరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సిలర్ కారంపొడి మహేష్ కాంగ్రెస్ నుండి కౌన్సిలర్‌గా గెలుపొందినా ఆయన ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. దీనిపై అనేక చర్చలు సాగుతున్నాయి. కారంపొడి మహేష్ గాలి జనార్దన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. మైనింగ్ కార్యకలాపాలు జరిగే సమయంలో ఈ ఇద్దరి మధ్య బలమైన బంధం ఉండేది. అందుకే గాలి సలహా ప్రకారమే కారంపొడి మహేష్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారనే చర్చలు సాగుతున్నాయి. మొత్తం మీద ఇది కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

ఎంపీ ఎన్నికలకు వాల్మీకి అభివృద్ధి సంస్థ నిధులు

● మాజీ ఎమ్మెల్యే అనిల్‌లాడ్ ఆరోపణ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 13: వాల్మీకి అభివృద్ధి సంస్థ నిధులను కాంగ్రెస్ నేతలు ఎంపీ ఎన్నికలకు ఉపయోగించారని మాజీ ఎమ్మెల్యే అనిల్ లాడ్ ఆరోపించారు. నగరంలోని జేడియస్ జిల్లాకార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి బి.నాగేంద్ర , నగర ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి, ఎంపీ.తుకారాం, రాజ్యసభ సభ్యుడు వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ నిధులను తాము తీసుకోలేదని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రమాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.21కోట్లకు పైగా దుర్వినియోగం జరిగిందని ఇది పెద్ద కుంభకోణమన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకున్నారని, ఆయనకు ఈ కోట్లాది కుంభకోణం ఎలా జరుగుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి శ్రీరాములు ఎంపీ ఎన్నికలలో గెలుస్తారని చాలా సర్వేలు జోస్యం చెప్పాయని, రకరకాల ప్రలోభాల వల్లే మన అభ్యర్థి ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఎస్టీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌లో జరిగిన కోట్లాది రుపాయల కుంభకోణంపై విచారణ ఇంకా కొనసాగుతోందన్నారు. దీనికి సంబంధించి ఈడీ అధికారులు ఛార్జ్‌షీట్ సమర్పించడంతో కాంగ్రెస్‌లో కలవరం మొదలైందన్నారు. ఈ కుంభకోణంలో జిల్లాకు 86కోట్లు వచ్చాయని, ఇందులో నాగేంద్ర , సీఎం. సిద్దరామయ్యల పాత్ర ఉందని, విచారణ తర్వాత అంత తేలిపోతుందన్నారు.

జేడియస్ జిల్లాఅధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే తుకారం రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరగనుందన్నారు. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గానికి జేడీఎస్, బీజేపీ కూటమి అభ్యర్థులను ఖరారు చేయనుందన్నారు. ఈసందర్భంగా జేడీఎస్ యూత్ యూనిట్ రాష్ట్ర కార్యదర్శి నాయకులు రాజనాయక్,సోమప్ప, లక్ష్మీకాంతరెడ్డి, శివనారాయణ, హొన్నూర్‌స్వామి, కిరణ్‌కుమార్, అశోక్ సంగనకల్లు, బసప్ప, వన్నూర్‌వలీ, భవాని,రావణ, శివాని,రేణుక , షమీన్‌భాను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌లాడ్, మీనళ్ళి తాయణ్ణ

క్రీడాపోటీలతో మానసిక వికాసం

విజయనగరం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ మునిరాజు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 13: ఆరోగ్యవంతమైన శరీరానికి ఆటలు ఉపయోగపడతాయని, విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడాపోటీలు దోహదపడతాయని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఎం.మునిరాజు అన్నారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన క్యాంపస్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కబడ్డీ సీజన్-1 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యూనివర్శిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని, యూనివర్శిటీలోని క్రీడా విద్యార్థులకు అవసరమైన అన్నిసౌకర్యాలు కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో యూనివర్శిటీలోని అని విభాగాల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యూనివర్శిటీ వైస్ చాన్సలర్ రుద్రేశ్ మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్ నందిహళ్ళిలో క్రీడలను ప్రోత్సహించేందుకు యూనివర్శిటీ ద్వారా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కబడ్డీ టోర్నీకి న్యాయనిర్ణేతలుగా షేక్షావలి, వీరనగౌడ, వీరాజంనేయులు ఉంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ మునిరాజు తదితరులు

సాంకేతికతపై అవగాహన

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా

బళ్లారి సిటీ, సెప్టెంబరు 13: నూతన రకాల నిర్మాణ వస్తువులు,సాంకేతికతను ప్రజలకు పరిచయం చేసే లక్ష్యంతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. శుక్రవారం సర్.ఎం.విశ్వేశ్వరయ్య 164వ జయంతి ని పురస్కరించుకుని బళ్లారి అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ ఇంజనీర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ మూడు రోజుల పాటు జరిగే ఎగ్జిబిషన్‌ను కమ్మభవనంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవనానికి సంబంధించిన నూతన వస్తువులు, సాంకేతికత గురించి తెలియజేసే ఈప్రదర్శన ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. పేద ప్రజలకు మేలు జరిగే విధంగా తక్కువ కావాల్సిన ఇళ్ల నిర్మాణానికి జిల్లాయంత్రాంగం కూడా సహకరిస్తుందని తెలిపారు. మంచి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భవనాల నిర్మాణం జరగాలన్నారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ గౌడ పాల్గొన్నారు.

ఉపయోగం లేని దోబీఘాట్

కంప్లి, సెప్టెంబరు 13 : కంప్లి తాలుకా సుగ్గినళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ రామ రంగాపురం గ్రామంలో సుగ్గినళ్లి రోడ్డులోని చాకలి వారికి ఏర్పాటు చేసిన దోబీఘాట్ పూర్తిగా ధ్వంసమై ఉపయోగం లేకుండా పడివుంది. చుట్టూ ముళ్లకంచెలు పెరిగి పైపులు ధ్వంసమై ఉపయోగం లేకుండా పోయింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే దోబీఘాట్ నిరుపయోగమైందని, ముళ్లకంపలు పెరగడంతో పాటు నీటి సౌకర్యం లేక ఇలా తయారయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు ముందుకొచ్చి వేసవి ప్రారంభం కాకముందే గ్రామస్తులకు, చాకలి వారికి ఉపయోగపడేలా మరమ్మతులు చేయించి చుట్టూ ముళ్లకంచెలు తొలగించి ఉపయోగంలోకి తేవాలని కోరారు.





ఖాళీగా వున్న నీటి ట్యాంకులు, బండరాళ్ల చుట్టూ వున్న అపరిశుభ్రత

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి

● జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, సెప్టెంబరు 13: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప తెలిపారు. శుక్రవారం వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా తాలూకా స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. పరిశుభ్రతకు పెద్దఎత్తున ప్రజల భాగస్వామ్యం, సమాజ భాగస్వామ్యం అవసరమన్నారు. సమస్యాత్మకమైన చెత్తాచెదారాన్ని తొలగించే పనిపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించేందుకు పౌరులంతా చేతులు కలపాలన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబరు 2వ తేదీని స్వచ్ఛ భారత్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈసంవత్సరం స్వచ్ఛ భారత్‌అభియాన్ 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. జలాశయాలు, రోడ్లు, రైల్వేస్టేషన్లు, చెత్తకుప్పలు, తదితరాలపై దృష్టిసారించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భారీ క్లీన్‌నెస్ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఈసందర్భంగా అన్ని తాలూకాల పీడీఓలు, జిల్లాపంచాయితీ ఉపకార్యదర్శి గిరిజాశంకర్, సహాయక సంచాలకులు శరణబసవరాజు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబితాను ఖరారు చేయాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 13: ఆశ్రయం పథకం కింద నిర్మించిన గృహాల ను త్వరితగతిన ప్రారంభించాలని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన షెల్టర్ ప్రాజెక్ట్ కమిటీ సమావేశంలో ఆయన అధికారుల నుంచి ప్రాజెక్టు స్థితిగతులను తెలుసుకున్నారు. నగరంలో వార్డుల వారీగా అర్హులైన లబ్దిదారుల జాబితాను ఖరారు చేసి.నిర్మించిన 809 ఇళ్లను అప్పగించే పనులు త్వరగా ప్రారంభించాలని, ఈపనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మగాంధీ టౌన్‌షిప్ ప్రాజెక్టును సమర్థవంతంగా పూర్తి చేయాలని,ఈ టౌన్‌షిప్‌కు అవసరమైన అన్ని మౌలిక వసతులు పూర్తి చేసి టౌన్‌షిప్ ప్రాజెక్టును విజయవంతం చేయాలని కోరారు. పాత ప్లాన్‌ను రెడీచేసి పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం తరపున లీజుకు ఇవ్వాలన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తే నగరవాసులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి అన్నారు. సమావేశంలో మేయర్ ముల్లంగి నందీశ్, కమిషనర్ ఖలీల్‌సాబు, కార్పోరేషన్ అధికారులు, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనం

బళ్లారిరూరల్, సెప్టెంబరు 13 : బళ్లారి నగరంలోని అనంతపురం రోడ్డు గాంధీనగర్ పోలీస్ స్టేషన్ సమీపంలోగల సెంటినరీ హాల్ ఆవరణలో గణపతికి తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి శుక్రవారం నిమజ్జనం చేశారు. బళ్లారి నగర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమం బళ్లారి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ నుండి రాయల్ సర్కిల్ బెంగళూరు రోడ్డు బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ సర్కిల్ మీదుగా నగరంలో సాగింది. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ శోభారాణి, అడిషనల్ ఎస్పీ రవి కుమార్, నవీన్ కుమార్ వారితో పాటు సిటీ డీఎస్పీ నందారెడ్డి, పలు పోలీసులు స్టేషన్ వద్ద ఉన్న అధికారులు ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నగర వీధుల్లో ఊరేగుతున్న గణనాథుడు

ఉపాధ్యాయులకు సన్మానం



ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ అనసూయ

బళ్లారిరూరల్, సెప్టెంబరు 13: బళ్లారి నగరం నల్లచెరువు సమీపంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అత్యంత ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు వారితో పాటు గ్రామీణ విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధికారులు ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పరుగుల వరద

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13: దులీప్‌ట్రోఫీలో పరుగుల వరద పారుతోంది. అనంతపురంలోని అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రౌండ్ దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు శుక్రవారం కొనసాగాయి. ఓవర్‌నైట్ స్కోర్ 288/8తో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా ఏ జట్టు మరో రెండు పరుగులు మాత్రమే జోడించి ఆలౌట్ అయ్యింది. క్రీజులో ఉన్న షాంశ్ ములానీ 89పరుగులకు, అఖీబ్‌ఖాన్ పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ దారి పట్టారు. ఖలీల్‌అహ్మద్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన ఇండియా డి జట్టు 183పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో ఇండియా ఏ జట్టుకు 107 పరుగుల ఆధిక్యం లభించింది. ఇండియా డి జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ డకౌట్ అయ్యాడు. జట్టులో దేవదత్ పడిక్కల్ మాత్రమే 92 పరుగులతో రాణించాడు. మిగతా బ్యాటర్లు ఆశించినమేరకు రాణించకపోవడంతో ఇండియా డి జట్టు 183 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇండియా-ఏ బౌలర్లు ఖలీల్ అహ్మద్, అఖీబ్ ఖాన్ చెరో 3వికెట్లు పడగొట్టారు. ప్రసిద్ధ్‌కృష్ణ, తనుష్‌కొటియాన్, షాంశ్ ములానీ తలో వికెట్ పడగొట్టారు. రెండో రోజు ఆటముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా ఏ 28.1ఓవర్లలో వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 56 పరుగులకు ఔట్ కాగా, ప్రథమ్‌సింగ్ 59పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఇండియా ఏ జట్టు 222పరుగుల ఆధిక్యంలో ఉంది.

రక్తదానం ఎంతో గొప్పది

కంప్లి, సెప్టెంబరు 13 : అన్ని దానాల్లోకన్నా రక్తదానం ఎంతో గొప్పదని మెట్రి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు గుండమ్మ తెలిపారు. మెట్రి గ్రామంలో దేవసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహదేవతాత రథోత్సవం, మారెమ్మదేవి జాతర పురస్కరించుకుని స్వామి వివేకానంద బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం చేపట్టారు. 113 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గిరీష్, మాజీ తాలుకా పంచాయతీ అధ్యక్షులు మహదేవ, కుమారస్వామి, వన్నూరమ్మ, గంగాధర, మెట్రి సొసైటీ అధ్యక్షులు జగదీష్, డాక్టర్ రేవణ సిద్దయ్య, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు జగదీష్, కుమారస్వామి, వన్నూరమ్మ, గంగాధర, మల్లికార్జున, చిదానందప్ప, నాగమ్మ, నాగరాజు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



ర్యాలీగా వెళ్తున్న కమ్యూనిస్ట్ నాయకులు, కార్యకర్తలు

ఏచూరికి ఘన నివాళి

హోసూరు సెప్టెంబరు 13: మార్కిస్ట్ పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి హోసూరు నగరంలో ఘనంగా నివాళి అర్పించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ప్రజా పోరాటంలో ఎల్లప్పుడూ ముందుండి నడిపిన ఆయన ఎందరికో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. మరణం తర్వాత కూడా అందరి హృదయాల్లో నిలిచి పోయారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యదర్శి జయరామన్, జాయింట్ సెక్రటరీ రాజారెడ్డి ఆధ్వర్యంల్లో నివాళులర్పించారు, వీరిల్లో మార్కిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు జేమ్స్ ఏంజెలా మేరి , జిల్లా కమిటీ సభ్యుల శ్రీధర్, నారాయణమూర్తి, జిల్లా కమిటీ సభ్యుల నాగేశ బాబు, వెన్నిలా, మూర్తి, రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, ద్రావిడ కళగం జిల్లా అధ్యక్షుడు వనవేందన్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదయ్యాన్, హ్యూమానిటీ పీపుల్స్ పార్టీ నాసర్, ఊరేగింపు, మౌన నివాళి సమర్పించారు. సిఐటియూ జిల్లా అధ్యక్షుడు వాసుదేవన్, కోశాధికారి శ్రీధరన్, అశోక్ లైలాండ్ ట్రేడ్ యూనియన్ కార్యవర్గంతో పాటు పలువురు పాల్గొన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ సరయూ

మ్యాంగో ఎగ్జిబిషన్ ప్రారంభం

హోసూరు (కృష్ణగిరి), సెప్టెంబరు 13 : ఫల, పుష్ప ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఆర్ట్స్ కళాశాల మైదానంలో 30వ అఖిల భారత మ్యాంగో ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమయ్యింది. ఆహార సరఫరా శాఖ మంత్రి చక్రపాణి, జిల్లా కలెక్టర్ సరయూ, కృష్ణగిరి పార్లమెంట్ సభ్యుడు కె.గోపినాథ్ తదితర ప్రముఖులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసెంబ్లీ సభ్యులు మదియళగన్ , తళి రామచంద్రన్, సమక్షంల్లో ప్రారంభించారు, అన్ని శాఖల ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల హోళ్లను సందర్శించారు, వివిధ శాఖల నుంచి 212 మంది లబ్దిదారులను సందర్శించారు. రూ.4 కోట్ల 33 లక్షల 2 వేల 967 విలువైన ప్రభుత్వ సంక్షేమ సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమిళనాడు ముఖ్యమంత్రి వ్యవసాయ రంగానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తూ వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పత్తిని పెంచడానికి రైతుల ఆదాయాన్ని పెంచడానికి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. హర్టికల్చర్ రంగంలో తమిళనాడులోని ఏ జిల్లాలో లేని విధంగా కృష్ణగిరి జిల్లాలో 1,02,000 హెక్టార్ల విస్తీర్ణంల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, ఇందులో కూరగాయలు 37,146 హెక్టార్లలో పండ్ల పంటలు 34,400 హెక్టార్లలో , పూలు 10,056 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రధానంగా 32,764 హెక్టార్లలో మామిడి సాగు చేయగా 2.60లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి అవుతోంది, ఇందుల్లో 1.20 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లను మామిడి గుజ్జు తయారీకి వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పి.తంగదురై, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కలెక్టర్ వందనకార్గే , ఎ.పి.జాయింట్ డైరెక్టర్ (హర్టికల్చర్ డిపార్ట్‌మెంట్)ఇందిర తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే జిల్లా సభ్యుల సమావేశం

హోసూరు, సెప్టెంబరు 13: డీఎంకే అధ్యక్షుడు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, క్రీడాశాఖ మంతి కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ ఆదేశాల మేరకు జిల్లా డీఎంకే ఆదేశాల మేరకు హోసూరు మెట్రోపాలిటన్ వెస్ట్ రీజియన్ జనరల్ సభ్యుల సమావేశం జరిగింది, 1 వ సర్కిల్ జనరల్ సభ్యుల సమావేశానికి ఛైర్మెన్ సూర్య నారాయణన్ అధ్యక్షత వహించారు. సర్కిల్ కార్యదర్శి వడివేలు అందరికి స్వాగతం పలికి తీర్మానాలను చదివి వినిపించారు. ఈసమావేశంల్లో మున్సిపల్ వెస్ట్ రిజీయన్ కార్యదర్శి హోసూరు మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య సమావేశానికి హాజరై ప్రత్యేక ప్రసంగం చేశారు, ఇంకా ఈ సమావేశంల్లో వెస్ట్ రీజియన్ కౌన్సిల్ ఛైర్మెన్ కరుణానిధి , జోనల్ కమిటీ ఛైర్మెన్ రవి, ఏరియా సర్కిల్ అడ్మినిస్ట్రేటర్లు సురేశ్, జాషువా, రఘు, సాగర్, దురై, గణేశ్, రమేశ్, శ్రీనివాసన్, సుందరమ్మలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అడ్మినిస్ట్రేటర్లు కలైవాసన్, మనోమురళి అన్నాదురై, సురేశ్, తదితరులు ఈ సమావేశంల్లో పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న డిప్యూటీ మేయర్ ఆనందయ్య

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రామ్ జెఠ్మలాని (జయంతి)



దేశంలో పేరొందిన ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు రామ్ జెఠ్మలాని 1923 సెప్టెంబరు 14న సిఖర్‌పూర్‌లో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) జన్మించారు. క్రిమినల్ న్యాయవాదిగా పేరొందారు. ముఖ్యంగా సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ పద్ధతులు కోర్టులో అతడి సామర్థ్యాన్ని నిరూపించాయి. ఇండియన్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగాను, కేంద్ర న్యాయ వ్యవహారాల శాఖ మంత్రిగాను వ్యవహరించారు. సుదీర్ఘకాలం రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఇండియా, పాక్ దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడేందుకు పాటుపడ్డారు. మానవహక్కుల పరిరక్షణకుగాను 1977లో ప్రత్యేక అవార్డు పొందారు. చట్టాలపై అవగాహనకు పలు పుస్తకాలు రాశారు. 2019 సెప్టెంబరు 8న కన్నుమూశారు.

గరికిపాటి నరసింహారావు (పుట్టినరోజు)



మహాసహస్రావధాని, ప్రవచన కిరీటి గరికిపాటి నరసింహారావు 1958 సెప్టెంబరు 14న పశ్చిమ గోదావరి జిల్లా బోడపాడు అగ్రహారంలో జన్మించారు. తెలుగు రచయిత, ఉపన్యాసకుడు. దేశంలోనే కాక విదేశాల్లో కూడా అవధానాలు చేశారు. 8 అష్ట, శత, ద్విశత అవధానాలు, వందలాది అష్టావధానాలు చేసిన ఘనత ఆయనది. 1,116 పద్యాలు (5వేల పంక్తులు) కలిగిన స్వీయకావ్యం 'సాగరఘోష'ను 8గంటల్లో ఏకధాటిగా మహాధారణ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. సాహిత్య, ఆధ్యాత్మిక అంశాలపై అనర్గళంగా ప్రసంగాలు చేస్తూ సామాజిక చైతన్యం కల్పిస్తున్నారు. గురజాడ విశిష్ట పురస్కారం, ధారణా బ్రహ్మరాక్షసుడు తదితర గౌరవాలు అందుకున్నారు. 2022 సంవత్సరంలో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

బూంగ్ జూన్-హో (పుట్టినరోజు)



దక్షిణ కొరియా దేశానికి చెందిన సినీ దర్శకుడు బూంగ్ జూన్-హో 1969 సెప్టెంబరు 14న జన్మించారు. రచయితగా, నిర్మాతగాను పేరొందారు. 21వ శతాబ్దంలో తొలి 25 ఉత్తమ సినీ దర్శకులలో 13వ స్థానంలో నిలిచిన ఘనత ఆయనది. 2019లో రూపొందిన బ్లాక్ కామెడీ థ్రిల్లర్ 'పారసైట్' సినిమా ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, స్క్రీన్‌ప్లే, ఉత్తమ అంతర్జాతీయ చలనచిత్రంగా 'ఆస్కార్ అవార్డు' అందుకుంది. 2020లో టైమ్స్ 100మంది ప్రభావవంతులైనవారి జాబితాలో ఒకరిగా నిలిచారు.

నైపుణ్యం ఉంటే కోరుకున్న ఉద్యోగాలు

» ఎస్‌జేబీఐటీ స్నాతకోత్సవంలో డాక్టర్ టీజీ సీతారాం



గోల్డ్‌మెడల్ విజేత రేష్మకు అభినందన

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాధారణంగా చదివామని ఉత్తీర్ణత మా ఆశయమని భావించరాదని అకడమిక్‌లో రాణిస్తూనే సాంకేతిక అంశాలపై నైపుణ్యతలో రాణిస్తే కోరుకున్న ఉద్యోగాలు సాధ్యమని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చైర్మన్ డాక్టర్ టీజీ సీతారాం అభిప్రాయపడ్డారు. కెంగేరిలోని ఎస్‌జేబీ ఇంజనీరింగ్ కళాశాల 20వ స్నాతకోత్సవం, ఎస్‌జేబీ ఆర్కిటెక్చర్ స్కూల్ ఏడవ స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్యులుగా పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ నైపుణ్యత అనేది నిరంతర ప్రక్రియగా ఉండాలన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో రాణించాలని అంతకంటే వేగవంతంగా మారుతున్న విజ్ఞానానికి అనుగుణంగా మారాలన్నారు. నైపుణ్యతే భవిష్యత్ ఆర్థిక సంపద కానుందన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా జ్ఞానంతో పాటు నైపుణ్యతలోను ముందుండాలన్నారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి డాక్టర్ నిర్మలానందనాథ స్వామి మాట్లాడుతూ స్వామి వివేకానంద ప్రభావంతో జెమ్‌షెడ్ టాటా ద్వారా ఐఐఎస్‌సీను ఆరంభించారన్నారు. అప్పట్లో దేశంలో ఇంజనీర్ల కొరత ఉండేదన్నారు అయితే ప్రస్తుతం ప్రపంచానికే ఇంజనీర్లను సమకూర్చేలాంటి భారత్‌లోని కళాశాలలు వచ్చాయన్నారు. విద్యార్థుల కేవలం జ్ఞానం మాత్రమే కాకుండా సంస్కారాన్ని నేర్చుకోవాలన్నారు. ఇదేసందర్భంగా ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ముఖ్యులు డాక్టర్ ప్రతాప్‌సింగ్ కాకా సాహెబ్ దేశాయ్, ఎత్నోటిక్ అకాడమి సొల్యూషన్స్ చైర్మన్ డాక్టర్ కిరణ్ రాజణ్ణ, చాంపియన్ గ్రూప్ ఎండీ హేమామని, కాగ్నిజంట్ ఇండియా రిక్రూట్‌మెంట్ ముఖ్యులు అశ్వథీ వేణుగోపాల్, కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఈసీ విద్యాధర టీ ఒడెయార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మహేంద్ర ప్రశాంత్ పాల్గొన్నారు. ఈసీఈ విభాగంలో రేష్మ, మెకానికల్ ఇంజనీరింగ్‌లో మోహన్‌కుమార్ 7 బంగారు పతకాలు, నగదు బహుమతి పొందారు. ఎస్‌జేబి ఇంజనీరింగ్ కళాశాల ద్వారా 650 మంది పట్టాలు పొందగా, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగంలో 120మంది పట్టాలు పొందారు. ఎస్‌జేబి బీజీఎస్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశనాథస్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

ఆనేకల్ తిమ్మయ్య భవన్ ఖాళీ చేయించాలి



రాయల్ కాన్‌కర్డ్ విద్యాసంస్థ ఎదుట ఆందోళనలో మాట్లాడుతున్న ఎంఆర్ జయరాం తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చామరాజ పేటలో రాయల్ కాన్‌కర్డ్ స్కూల్ కొనసాగుతున్న భవనం ఆనేకల్ తిమ్మయ్య ఛారిటీ ట్రస్టుకు చెందినదని వెంటనే ఖాళీ చేయించాలని గోకుల ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఆర్ జయరాం డిమాండ్ చేశారు. చామరాజపేటలోని బలిజసంఘం సభ్యులు రాయల్ విద్యాసంస్థ ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తిమ్మయ్య ఛారిటబుల్ ట్రస్టు 1936 నుంచి బలిజ కులానికి చెందిన పేద విద్యార్థుల కోసం శ్రమిస్తోందన్నారు. 400 మంది విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించిందన్నారు. మాజీ ఎంపీ ఎల్ఆర్ శివరామేగౌడ అతడి కుటుంబానికి చెందిన వారు రాయల్ కాన్‌కర్డ్ విద్యాసంస్థను తిమ్మయ్య దత్తి సంస్థలో కొనసాగిస్తున్నారన్నారు. 2016 నుంచి బాడుగ చెల్లించకుండా వాయిదాలు వేస్తున్నారన్నారు. సుమారు 16 కోట్ల మేర బాడుగ బకాయి పడ్డారన్నారు. ఇదే విషయమై పోలీసులను ఆశ్రయించినా న్యాయం లభించ లేదన్నారు. వెంటనే సదరు భవనాన్ని ఖాళీ చేయాలని డిమాండ్ చేశారు. ట్రస్టు అధ్యక్షులు కూచన్న శ్రీనివాసన్, కార్యదర్శి డీఎన్ గిరియప్పల ఆధ్వర్యంలో జరిగిన నిరసనకు పెద ఎత్తున నగర పరిధిలోని బలిజ కులస్తులు పాల్గొన్నారు. నిరసనకు స్థానికుల మద్దతు లభించింది.

వరద బాధితులకు చేయూత

» 4వేల కుటుంబాలకు 30లక్షల వస్త్రాల కిట్‌ల పంపిణీ

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రాంత వరద బాధితులను ఆదు కునేందుకు పలు సంఘాలు ముందుకొస్తున్నాయి. బుడమేరు వాగు వరద ఉధృతితో అతలాకుతలమైన ప్రదేశంలో విజయవాడ నగరంలోని రాజరాజేశ్వరి పేట ఒకటి. బెంగళూరు నగరంలో స్థిరపడిన చిత్తూరు జిల్లాకు చెందిన బిల్డర్ ఎత్తిరాజులు నాయుడు ఆధ్వర్యంలో గురువారం వస్త్రాలను పంపిణీ చేశారు. 4వేల కుటుంబాలకు సుమారు 30లక్షల రూపాయల విలువైన వస్త్రాల కిట్‌లను పంపిణీ చేశారు. ఇందుకు మురళిబాబు, భీమినేని సురేష్, ప్రభు, కే పూర్ణచంద్ర, సుబ్రమణ్యం నాయుడు, బండి రాజేష్, మోహన్‌రెడ్డి తదితరులు సహకారం అందించారని నగరంలో శుక్రవారం నిర్వాహకులు వెల్లడించారు.



వస్త్రాలను అందచేస్తున్న బెంగళూరు బిల్డర్స్

మలేషియా కుకా కంపెనీతో పీఈఎస్ ఒప్పందం



ఒప్పందంలో పీఈఎస్ యూనివర్సిటీ, కుకా సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీలో రోబోటిక్స్ ఆటోమేషన్ విభాగంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఆరంభించగా మలేషియాకు చెందిన కుకా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రగతి విద్యాకేంద్ర పేరిట పరిశోధనలు ఆవిష్కరణలు, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాలలో విద్యార్థులకు మరింత నైపుణ్యత సాధించే దిశగా సెంటర్ పనిచేయనుందని ప్రకటించారు. ఎలక్ట్రానిక్‌సిటీ క్యాంపస్‌లో ఎక్సలెన్సీ సెంటర్ పని చేయనుందన్నారు. కుకా ఏపీఈసీ చీఫ్ రీజనల్ ఆఫీసర్ అలన్‌తం, పీఈఎస్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జె. సూర్యప్రసాద్‌లు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో కుకా ఇండియా లిమిటెడ్ ఎండీ అభిజిత్ మిశ్రా, పీఈఎస్ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు యూనివర్సిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

పురసభ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఏకగ్రీవం

బాగేపల్లి, సెప్టెంబరు 13: బాగేపల్లి పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 23వ వార్డుకు చెందిన సభ్యుడు ఏ శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా 8వ వార్డు సభ్యుడిగా సుజాత నరసింహనాయుడు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తహసీల్దార్ ఎన్ మనీషా ప్రకటించారు. శుక్రవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానా లకు ఎన్నికలు జరిగాయి. పట్టణ అభివృద్ధి దృష్టితో కాంగ్రెస్, జేడీఎస్ ఇతర స్వతంత్ర సభ్యులు కలసికట్టుగా ఉండి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి సూచనతో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. తహసీల్దార్ ఎన్ మనీషా మాట్లాడుతూ బాగేపల్లి పురసభ, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 25 మంది ఓటర్లు ఉండగా నలుగురు గైర్హాజరయ్యారన్నారు. ఎన్నికల వేళ అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ధి బందోబస్తు కల్పించారు. కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు మిఠాయిలు తినిపించి బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్, సభ్యులు శ్రీని వాసరెడ్డి, అశోకరెడ్డి, గడ్డం రమేశ్, గుల్నాజ్‌బేగం, జబీ వుల్లా ఖాన్, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అభినందన

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం



ప్రారంభంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, సెప్టెంబరు 13: పాత ఘటనలను జ్ఞాపకం ఉంచుకునేలా భావితరాలకు అందించడానికి ఫోటోగ్రఫీ పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అబ్దుల్‌వహాబ్ లే అవుట్‌లో నూతనంగా నిర్మించిన ఛాయా భవనాన్ని ప్రారంభించి, 185వ ఫోటోగ్రఫీ డేను శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు వందేళ్లకుపైగా అస్తిత్వంలో ఉన్న ఫోటోగ్రఫీ కళ మన జీవనంలో భాగమన్నారు. కెమెరా లేకుంటే ఎన్నో విలువైన క్షణాలు, సందర్భాలు గుర్తుంచుకోవడం సాధ్యమయ్యేది కాదన్నారు. గతంలో ఫోటోగ్రాఫర్ జీవనం చాలా కష్టంగా ఉండేదని, పెళ్లి ఇతర శుభ కార్యక్రమాలకు మాత్రమే అవశ్యకత ఉండేదన్నారు. అంతటివృత్తిలో జీవనం సాగించినవారి సాధనలను అభినందించారు. ప్రస్తుతం అందరూ కలసికట్టుగా సంఘం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ భవనంపై రెండుగదుల నిర్మాణానికి తన గ్రాంటు నుంచి రూ.2.50 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, రోడ్డు ఇతర వ్యవస్థ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు ఎంజి గోవింద, సభ్యులు ఎస్ వెంకటేశ్, ఆరోగ్యరాజన్, కోలారు జిల్లా ఫోటోగ్రాఫర్‌ల సంఘం అధ్యక్షుడు వి కృష్ణ, తాలూకా సంస్థాపక అధ్యక్షుడు బిసి శ్రీనివాస్ మూర్తి, ఇన్‌స్పెక్టర్ నంజప్ప, ఎస్సై రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణరంగంలో పెరిగిన ఆధునికీకరణ

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో ఆధునీకరణ పెరిగిందని ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం అభిప్రాయపడ్డారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీస్ స్మార్ట్ సస్టైనబిలిటీ కన్‌స్ట్రక్షన్ పేరిట శుక్రవారం అంతర్జాతీయ సమ్మేళనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇన్‌స్ట్రక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ ట్రేడ్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో సమ్మేళనం జరిగింది. ఇంజనీర్‌లు, ఆర్కిటెక్చర్‌లు, వాస్తు శిల్పులు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ టీజీ సీతారాం మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి, విశ్వానికి అవసరమైన డిమాండ్లను బట్టి మార్పు చేయాల్సి ఉందన్నారు. నగరీకరణ, పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటూనే ప్రగతి కీలకమే అన్నారు. సమ్మేళనం అధ్యక్షులు సీఆర్ పార్థసారథి మాట్లాడుతూ దేశంలో జాతీయ రహదారులు, ఓడరేవులు, జలవిద్యుత్ స్థావరాలు అనేకమైన నిర్మాణరంగాలలో ఆధునికత వచ్చిందన్నారు. ఇన్‌స్ట్రక్ట్ చైర్మన్ ఎఆర్ శేషాద్రి మాట్లాడుతూ నిర్మాణ సహభాగత్వం కోసం నైపుణ్యత, శిక్షణలు ముఖ్యమన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ సివిల్ ఇంజనీర్‌ల సాధనల గురించి మాట్లాడారు.



నిర్మాణరంగ సమ్మేళన బ్రోచర్ విడుదల చేస్తున్న ముఖ్యులు

ప్రయాణికుల పట్ల సౌమ్యంగా వ్యవహరించండి

శిడ్లఘట్ట, సెప్టెంబరు 13: ప్రయాణీకుల పట్ల సౌజన్యంగా వ్యవహరించాలని కేఎస్‌ఆర్టీసీ బస్సు డ్రైవర్‌లు, కండక్టర్‌లకు పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై కే వేణుగోపాల్ సూచించారు. తాలూకాలోని హిత్తలహళ్ళి గేట్ సమీపానగల కేఎస్‌ఆర్టీసీ డిపోలో రవాణా సంస్థ డ్రైవర్, కండక్టర్‌లు సిబ్బందికి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ప్రత్యేకించి బస్సులలో సీనియర్ సిటిజన్‌లు, మహిళలు, పాఠశాల విద్యార్థుల పట్ల సంయమనంతో వ్యవహరించాలన్నారు. డ్రైవర్‌లు వృత్తి పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. డ్రైవింగ్ వేళ సాధ్యమైన మేరకు మొబైల్ వాడరాదని సూచించారు. ఇటీవలి కాలంలో రవాణాసంస్థలో బస్సుల ప్రమాదాల సంఖ్య పెరిగిందని ఇది ప్రయాణీకులు, ప్రజలలో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్‌లు, కండక్టర్‌లు, రవాణా వ్యవస్థపై విశ్వాసం తగ్గే వీలుతుందన్నారు. కాగా బస్సు ప్రయాణాల వేళ ప్రజలు తమ విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, భారీ మొత్తంలో నగదు వంటివి తీసుకెళ్లరాదని సూచించారు. డిపో మేనేజర్ గంగాధర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో డ్రైవర్‌లు, కండక్టర్‌లు తమ విధి నిర్వహణలో నిబంధనలు పాటించాలన్నారు.



ప్రత్యేక శిబిరంలో సూచనలు ఇస్తున్న ఎస్ఐ వేణుగోపాల్

అలరించిన వేషధారణ పోటీలు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 13: తాలూకాలోని మేలూరు గ్రామంలోని హెచ్‌జెసి స్కూల్‌లో గోకులాష్టమిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, పాఠశాల నిర్వాహకుల ఆధ్వర్యంలో శుక్రవారం రాధాకృష్ణ, పురాణ పురుషులు వేషధారణ పోటీలు అలరించాయి. పరిషత్ కోలారు సంఘటనా కార్యదర్శి సాగర్‌జీ అధ్యక్షత వహించారు. పురాణాలతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలను మరింత విస్తృతం చేసే దిశలో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. పరిషత్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, తాలూకా కార్యదర్శి మల్లేశ్, మేలూరు మహేశ్, సుధీర్, సుదర్శన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాధాకృష్ణులు, పురాణ పురుషుల వేషధారణలో చిన్నారులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

బాగేపల్లి, సెప్టెంబరు 13: సీపీఎం ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు సీతారాం ఏచూరి మృతి పట్ల పట్టణంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం బసవరాజ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలోని సుందరయ్యభవనంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జీవితమంతా ప్రజలకోసం, సమాజం కోసం పాటుపడిన నాయకుడి లేని లోటు తీర్చలేనిదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముని వెంకటప్ప, పార్టీ ప్రముఖులు డాక్టర్ అనిల్‌కుమార్, ఆవులప్ప, రఘురామ రెడ్డి, చన్నరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కుస్తీలో జిల్లాస్థాయికి ఎంపిక



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

దేవనహళ్ళి, సెప్టెంబరు 13: తాలూకా స్థాయిలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో ప్రగతి హైస్కూల్ ఉత్తమ ప్రతిభను కనబరచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. దేవనహళ్ళి తాలూకా క్రీడామైదనంలో గురువారం జరిగిన పోటీల్లో తాలూకా హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14 విభాగంలో 48 కేజీల విభాగంలో కీర్తన్‌రాజ్ ప్రథమస్థానంలో నిలవగా, 45 కేజీల విభాగంలో ఆర్‌పి గగన్, 41 కేజీల విభాగంలో మిథున్‌లు ప్రథమ స్థానంలో గెలుపొందారు. అండర్ 17 విభాగంలో 66 కేజీల విభాగంలో ఎం యతీశ్ ప్రథమస్థానంలో నిలవ గా, 45 కేజీల విభాగంలో మోహిత్ ద్వితీయస్థానంలో, 92 కేజీల విభాగంలో ప్రణీత్ ద్వితీయస్థానంలో నిలిచారు. ఇలా ఇతర విభాగాల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని సంస్థ అధ్యక్షుడు సతీశ్‌కుమార్ అభినందించారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 25టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సీఎల్ఐసీ పరీక్షా ఫలితాలు విడుదల

కొత్తచెరువు, సెప్టెంబరు 13: సీఎల్ఐసీ-2024 పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిందని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ శుక్రవారం తెలిపారు. ఈ ఫలితాలను గిగిగి.ఈఖీఉ.ఆ్క.ఫ్గెఖ్గా వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. అదేవిధంగా డమ్మి మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

దేశద్రోహులే ఆయనకు మిత్రులు

బెంగళూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశానికి శత్రువులే రాహుల్‌గాంధీకి మిత్రువులని, ఆయన విదేశాలకు వెళ్లేది దేశ వ్యతిరేకులకు షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకేనని బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, బెంగళూరు దక్షిణ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య మండిపడ్డారు. మల్లేశ్వరంలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ అమెరికాకు వెళ్ళి భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడటాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. దేశ వ్యతిరేక శక్తులకు ప్రోత్సాహం ఇచ్చినట్లుగా రాహుల్ వ్యవహరించారన్నారు. దేశ వ్యతిరేకులు ఎవరు ఉన్నారో వారితోనే అతడు స్నేహంగా ఉన్నట్లుగా ఉందన్నారు. ఇండియన్ ఎనిమీస్ ఆర్ రాహుల్‌గాంధీ ఫ్రెండ్స్ అన్నారు. దేశంలో ఉన్నప్పుడు బీజేపీ రిజర్వేషన్‌లను రద్దు చేసే కుట్ర పన్నుతోందని, కులగణన ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందని ప్రసంగాలు చేస్తారన్నారు. అదే విదేశాల్లో దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌లు రద్దు చేస్తామని చెబుతారన్నారు. రిజర్వేషన్‌లను నిరంతరంగా వ్యతిరేకించింది కాంగ్రెస్ పార్టీనే అంటూ మండిపడ్డారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ నుంచి రాజీవ్‌గాంధీ దాకా రిజర్వేషన్‌లను వ్యతిరేకించింది వారే అన్నారు. దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించిన ఇల్హన్ ఒమర్‌ను అమెరికాలో రాహుల్‌గాంధీ భేటీ కావడం సరి కాదన్నారు. దేశంలో మానవహక్కులకు వ్యతిరేకంగా వ్యవహరించడమే కాకుండా భారతీయులకు అమెరికాలో గ్రీన్‌కార్డులు ఇవ్వరాదని అమెరికా కాంగ్రెస్‌లో ప్రస్తావించిన వారన్నారు. దేశ వ్యతిరేక ధోరణి అవలంబిస్తున్న బంగ్లాదేశ్‌కు చెందిన ముష్ఫికల్ ఫజల్ అనే పాత్రికేయుడితోను రాహుల్ కలిసి తిరిగారని, అమెరికాలో సిక్ఖ్ ఫర్ జస్టిస్‌కు చెందిన పన్ను వంటి ఖలిస్తాన్ ఏజెంట్‌లతో కలిసి మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారని మండిపడ్డారు.

ఆంధ్రులకు అండగా

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో సంభవించిన వరదలకు తెలుగు విజ్ఞాన సమితి అండగా నిలిచింది. వరదలతో లక్షలాదిమంది జీవనం కోల్పోయారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు పిలుపునిచ్చారు. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5లక్షలు ప్రకటించారు. నగరంలో శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వరదబాధితులను ఆదుకునేందుకు తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో సహాయనిధి విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరుతోపాటు సమీప ప్రాంతాలవారు వరదబాధితులను ఆదుకునేందుకు విరాళాలు పంపాలన్నారు. గతంలో దివిసీమ ఉప్పెనతోపాటు ప్రకృతి వైపరీత్యాల వేళ తెలుగు విజ్ఞాన సమితి ప్రత్యేకంగా పనిచేసిందన్నారు. విరాళాలు ఇచ్చే వారికి ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఉందన్నారు. ఏపీ సీఎం సహాయనిధికి రూ.5లక్షలు చెక్కు ఇవ్వాలని సమితి ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మి రెడ్డి, కోశాధికారి వరదరాజు, కార్యనిర్వాహక సభ్యుడు కృష్ణయ్యనాయుడుతోపాటు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిదని తెలిపారు. సహాయనిధికి విరాళాలు పంపదలిచినవారు తెలుగు విజ్ఞాన సమితిని సంప్రదించాలన్నారు.

వైభవంగా మహదేవ తాత రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి, సెప్టెంబరు 13 : తాలుకా పరిధిలోని మెట్రి గ్రామంలో మహదేవ తాత ప్రణవజ్యోతి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మహదేవ తాత మండపంలో ప్రణవ జ్యోతి లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంట మహిళలకు ఒడి నింపే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి యేటా ఈ రథోత్సవం తాలుకాలో గుర్తుండిపోయేలా చేపడతారు. ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని ఊరేగించారు. మెట్రితో పాటు దేవలాపురం, జవుకు జానూరు, దేవసముద్రం, కంప్లి, గంగావతి, సిరుగుప్ప, బళ్లారి, హొస్పేట, కురుగోడు వివిధ గ్రామాల నుంచి భారీఎత్తున పాల్గొని పూజలు, పూలుపండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు.